క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న నుడా చైర్మన్



నెల్లూరు(బృందావనం): తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామిని నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాథ్ కుటుంబ సమేతంగా మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తిరుమలలోని లక్ష్మీ వీపీఆర్ అతిథిగృహంలో ద్వారకానాథ్, ఆదిలక్ష్మీకుమారి దంపతులతో పాటు నూతనవధూవరులు ప్రశాంత్, ఉషశ్రీను తిరుమల బాలాజీనగర్ ఆర్యవైశ్య కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

సముద్రాల లక్ష్మయ్య మరణం తీరని లోటు

నెల్లూరు(బృందావనం): సుప్రసిద్ధ సంస్కృత పండితులు, సాహితీవేత్త, మహామహోపాధ్యాయ డాక్టర్ సముద్రాల లక్ష్మయ్య(86) మరణం సాహితీ, ఆధ్యాత్మిక లోకానికి తీరనిలోటని నెల్లూరుకు చెందిన కవులు, రచయితలు డాక్టర్ టేకుమళ్ల వెంకటప్పయ్య, డాక్టర్ పెరుగురామకృష్ణ, పీ సుజనారామం, ఆయన ప్రత్యక్ష శిష్యుడు అల్లు భాస్కరరెడ్డి మంగళవారం ఓ సంయుక్త ప్రకటనలో సంతాపం తెలిపారు. తిరుపతిలోని ఓ ఆస్పత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న లక్ష్మయ్య సోమవారం రాత్రి తుదిశ్వాస విడిచారని చెప్పారు. చిత్తూరు జిల్లా ఏర్పేడు సమీపంలోని కాట్రకాయలగుంటలో జన్మించిన లక్ష్మయ్యకు సాహితీ, ఆధ్యాత్మిక పరంగా నెల్లూరు జిల్లాతో ఎంతో అనుబంధం ఉందన్నారు. టీటీడీ ధర్మ ప్రచార పరిషత్తు, పురాణ ఇతిహాస ప్రాజెక్ట్, భగవద్గీత ప్రాజెక్ట్, అన్నమయ్య సంకీర్తనల్లో వేదాలు, రామాయణ, మహాభారత, ఉపనిషత్తులు, పురాణాల్లోని పలు అంశాలను బహుళ ప్రాచుర్యంలోకి తెచ్చిన ఘనాపాటి లక్ష్మయ్యగా ఆయన సేవలను శ్లాఘించారు.

క్రీడాకారిణులకు అభినందన



నెల్లూరు(అర్బన్): దర్గామిట్టలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు టీ కుసుమ, వేమిరెడ్డి సాయి జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీల్లో కుసుమ రాణించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. అలాగే వేమిరెడ్డి సాయి చెస్ పోటీల్లో విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా క్రీడాకారిణులను కళాశాల ప్రిన్సిపల్ విజయకుమార్, పీడీ శ్రీనివాసరావు మంగళవారం కళాశాలలో అభినందించారు.

వినియోగదారులకు సహకరించాలి



నెల్లూరు (సెంట్రల్): వినియోగదారులకు సహకరిస్తూ వ్యాపారులు కూరగాయల వ్యాపారం చేసుకోవాలని వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ అధ్యక్షుడు హరిబాబు, ఏడీ అనితాకుమారి సూచించారు. మద్రాసు బస్టాండ్ వద్దనున్న వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ కార్యాలయంలో ఏసీఎస్ఆర్ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారులు తమకు కేటాయించిన షాపుల్లో మాత్రమే వ్యాపారం చేసుకోవాలన్నారు. రోడ్డుపైకి వచ్చి వినియోగదారులకు అసౌకర్యం కల్పించొద్దని సూచించారు. ప్రతిషాపులో ధరల పట్టిక, చెత్త బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. తూకాలను ఖచ్చితంగా వేయాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు వినియోగించొద్దని సూచించారు. ఈ సమావేశంలో టీసీ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల భూములను కాపాడుకుంటాం

నెల్లూరు(బారకాసు): ముస్లిం మైనార్టీలకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం కాకుండా తాము కాపాడుకుంటామని ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు మొహ్మద్‌జియాఉల్ హక్ పేర్కొన్నారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1923 ప్రభుత్వ చట్ట ప్రకారం నగరంలోని అంబాపురం, నవాజ్‌ఖాన్‌పేట ప్రాంతంలోని భూములు మైనార్టీలకు చెందినవని తెలిపారు. ఈ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. పఠాన్‌ఆషిక్, సర్ఫరాజ్ షబ్బీర్, రెహ్మాన్ పాల్గొన్నారు.

కమిషన్‌పై వాగ్వాదం

నెల్లూరు (అర్బన్): కరోనా సమయంలో ప్రైవేట్ అంబులెన్స్ సర్వీసులను వైద్యశాఖ వినియోగించుకుంది. అందుకు సంబంధించిన బిల్లులు ఆలస్యంగా విడుదలయ్యాయి. ఈ బిల్లులు చెల్లించేందుకు 13 శాతం కమిషన్ ఇవ్వాలని వైద్యశాఖ సీనియర్ అసిస్టెంట్ ఒకరు అంబులెన్స్ సిబ్బందికి కలెక్టరేట్ వద్ద మంగళవారం తెలిపారు. ఈ విషయమై ఇరువురి మధ్యన తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ ఘటనను కొందరు వీడియో తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. బిల్లులకు కమిషన్ విషయం వైద్యశాఖలో సంచలనం రేకెత్తించింది.

ఇరిగేషన్ కాలువ కబ్జా

- కొండాయపాళెంలోని కాలువపై కన్నేసిన అక్రమార్కుడు
- రూ.3 కోట్ల విలువైన స్థలాన్ని చదును చేసి ఆక్రమణ
- 40 అడుగుల కాలువను పూడ్చివేస్తున్న వైనం
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



సాగునీటి కాలువను ఆక్రమించి మట్టితోలిన దృశ్యం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నగరంలో భూకబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ భూములే కాదు ఇరిగేషన్ కాలువలను సైతం ఆక్రమించేస్తున్నారు. యథేచ్ఛగా ఆక్రమణలు సాగిస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారుల ఉదాసీన వైఖరితో ఖరీదైన ఏరియాల్లోని కాలువలు కుంచించుకుపోతున్నాయి. ఈ కారణంగా వరదనీరు వెళ్లేందుకు కాలువలు లేక నగరానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా కొండాయపాళెం సమీపంలోని సాగునీటి కాలువను ఓ అక్రమార్కుడు ఆక్రమణ చేస్తున్నాడు. కోట్ల రూపాయల విలువ చేసే కాలువను ఆక్రమణ చేస్తున్నా ఇరిగేషన్ శాఖ పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు.

ఆక్రమణలు ఇలా..

నగరంలో కరోనా అనంతరం రియల్ బూమ్ పుంజుకుంది. భూములు, ప్లాట్ల ధరలు నింగిని తాకుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆక్రమణలు పెరిగిపోయాయి. తాజాగా అన్నమయ్య సర్కిల్ నుంచి గొలగమూడి వెళ్లే రహదారి సమీపంలోని కొండాయపాళెం వద్ద ఇరిగేషన్ కాలువను ఓ వ్యక్తి కబ్జా చేస్తున్నాడు. నెల్లూరు చెరువు నుంచి కొండాయపాళెం, కనపర్తిపాడు భూములకు రెండు కాలువల ద్వారా సాగునీటి పారుదల ఉంది. దాదాపు 40 అడుగుల వెడల్పు కలిగిన కాలువలను పూడ్చివేసి చదును చేస్తున్నాడు. నెల్లూరు చెరువు నుంచి టెక్కేమిట్ట, మాగుంట లేఅవుట్ మీదుగా వెళ్లే ఇరిగేషన్ కాలువ మినీబైపాస్ దాటిన తర్వాత రెండు పాయలుగా చీలుతుంది. ఒకటి కనుపర్తిపాడు, మరొకటి కొండాయపాళెం భూములకు సాగునీరు అందిస్తుంది. దాదాపు 400 ఎకరాలకుపైగా సాగునీరు అందించే ఈ కాలువలను గతంలో కొందరు పూడ్చి చేసి తమ స్థలాల్లో కలుపుకొని విక్రయించుకున్నారు. అదే విధంగా ప్రస్తుతం ఓ అక్రమార్కుడు దాదాపు 60 అంకణాల కాలువ భూమిని పూడ్చివేసి ఆక్రమించుకున్నాడు. ప్రస్తుతం కొండాయపాళెం ఏరియాలో అంకణం స్థలం విలువ రూ.3 లక్షలకుపైగా ధర బహిరంగ మార్కెట్‌లో పలుకుతోంది. ఆ విధంగా చూస్తే దాదాపు 60 అంకణాల స్థల విలువ దాదాపు రూ.3 కోట్లుగా ఉంటుంది. ఇంతటి విలువైన కాలువ స్థలాన్ని ఆక్రమిస్తున్నా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆక్రమణలను పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కొండాయపాళెంలో ఇరిగేషన్ కాలువ ఆక్రమణ విషయం మా దృష్టికి వచ్చింది. ఆక్రమణలను పరిశీలించి కాలువను సర్వే చేయిస్తాం. కాలువ స్థలం ఆక్రమణ చేసి ఉంటే వెంటనే బోర్డు పెట్టి ఆక్రమణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం.

– కే నాగరాజు, ఈఈ, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్

కాలువల ఆక్రమణతో ముంపు సమస్య

నగరంలోని సాగునీటి కాలువల ఆక్రమణతో భవిష్యత్‌లో ముంపు సమస్య తలెత్తే అవకాశం ఉంది. భారీ వర్షాల సమయాల్లో వరద నీరు పోయే అవకాశం లేక నగరం ముంపునకు గురవుతుందని నగరవాసులు ఆందోళన చెందుతున్నారు.

నులిపురుగుల నివారణకు కృషి



విద్యార్థితో మాత్రను మింగిస్తున్న కలెక్టర్



కొండాయపాళెం పాఠశాలలో ..



మన్సూర్‌నగర్ స్కూల్‌లో..

నెల్లూరు (అర్బన్): 1 నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థుల్లో నులిపురుగుల నివారణకు కృషి చేద్దామని కలెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పొదలకూరురోడ్డులోని డీసీఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల నివారణకు ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు. పలువురు విద్యార్థులతో కలెక్టర్ స్వయంగా మాత్రలు మింగించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ నులి పురుగులతో బద్ధకం, ఆకలి మందగించడం, నీరసం, రక్తహీనత, తదితర లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు. ప్రతి ఆరు నెలలకొకసారి ఆల్బెండాజోల్ మాత్రలు మింగిచడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని వివరించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, సర్వశిక్ష ఏపీసీ ఉషారాణి, విద్యాశాఖ ఏడీ నారాయణ, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం జయమ్మ, ఆర్బీఎస్‌కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలోని మల్లికార్జునపురం పట్టణ ఆరోగ్య కేంద్రం, మన్సూర్ నగర్, సుజాతమ్మకాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగిన ఆల్బెండాజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని డాక్టర్ సెలీనాకుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆల్బెండాజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించవచ్చని తెలిపారు. 19 ఏళ్లలోపు విద్యార్థులతో మాత్రలను తప్పకుండా మింగించాలని సూచించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అశోక్, కోటమిట్ట అర్బన్ ఆరోగ్య కేంద్రం సీఓ తిరుపతయ్య, ఆరోగ్య, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.
- కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెల్త్ సూపర్ వైజర్ అంకమ్మ ఆధ్వర్యంలో ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు హరీష్, సంధ్యారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్

- రూ.3 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ పోలీసుల కళ్లుగప్పి తిరుగుతున్న ఓ పాతనేరస్తుడిని దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి దర్గామిట్ట పోలీసుస్టేషన్‌లో నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి స్థానిక ఇన్‌స్పెక్టర్ సీహెచ్ సీతారామయ్యతో కలిసి నిందితుడి వివరాలను విలేకరులకు వెల్లడించారు. కావలి మండలం బుడంగుంట కాలనీకి చెందిన నున్న లక్ష్మీనారాయణ వ్యసనాలకు బానిసై నేరస్తుడిగా మారాడు. కావలి, నెల్లూరు, విజయవాడ, తదితర ప్రాంతాల్లో ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన కేసులు ఆయనపై ఉన్నాయి. గత కొంతకాలంగా కావలికి చెందిన పాతనేరస్తులు ఎస్ వెంకటేశ్వర్లు, మరికొందరితో కలిసి నేరాలకు పాల్పడసాగాడు. పగలు తన టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై తిరుగుతూ తాళంవేసిన ఇళ్ల వద్ద రెక్కీ నిర్వహించి రాత్రి వేళల్లో తన బృందంతో కలిసి చోరీలకు పాల్పడసాగాడు. ఈ ఏడాది జనవరిలో సీసీఎస్‌నగర్‌లోని శ్రీకాకుళం డీటీసీ డీఎస్పీ ఇంట్లో అరకేజీ విలువచేసే వెండి ఆభరణాలను అపహరించుకెళ్లారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన దర్గామిట్ట పోలీసులు నిందితుడు నున్న లక్ష్మీనారాయణగా గుర్తించి మంగళవారం మద్రాసుబస్టాండ్ వద్ద నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం తమదైన శైలిలో విచారించగా దర్గామిట్ట పోలీసుస్టేషన్ పరిధిలో రెండు, కావలి ఒకటో పట్టణ పరిధిలో మూడు, సంతపేటలో ఒకటి, కోవూరులో రెండు, నవాబుపేట పరిధిలో మూడు నేరాలకు పాల్పడినట్లు అంగీకరించాడు. దీంతో అతనిని పోలీసులు అరెస్ట్‌చేశారు. అతని వద్ద నుంచి రూ.3 లక్షల విలువచేసే 53గ్రాముల బంగారు ఆభరణాలు, 150 గ్రాముల వెండి సామగ్రి, టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతేడాది నగరంలో సంచలనం రేకెత్తించిన పొగతోటలోని ఓ వైద్యుడి ఇంట్లో చోరీ కేసులోనూ లక్ష్మీనారాయణ నిందితుడు. ఇప్పటికే అతని సహచరులందరూ జైలులో ఉన్నారని డీఎస్పీ తెలిపారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి చోరీ సొత్తు రాబట్టుటకు కృషిచేసిన ఇన్‌స్పెక్టర్, స్థానిక ఎస్సై రమేష్‌బాబు. క్రైమ్ హెడ్‌కానిస్టేబుల్ సురేష్, కానిస్టేబుల్ వేణు, తదితరులను డీఎస్పీ అభినందించారు.

ఇంట్లో చోరీ

నెల్లూరు(క్రైమ్): ఇంట్లో వృద్ధ దంపతులు నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు లోనికి ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లిన ఘటన మంగళవారం వేకువన చోటుచేసుకుంది.వివరాలు..గుర్రాలమడుగు సంఘంలో కళాకారుడు మస్తానయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. అందరికి వివాహమై వేర్వేరుగా జీవిస్తున్నారు. మస్తానయ్య తన భార్యతో కలిసి సోమవారం రాత్రి నిద్రపోయారు. మంగళవారం వేకువన గుర్తుతెలియని దుండగుడు తలుపు గట్టిగా నెట్టడంతో తెరుచుకోవడంతో లోనికి ప్రవేశించాడు. బీరువాను తెరిచారు. పైర్యాక్‌లో చీరల కింద ఉన్న లాకర్ తాళం తీసుకుని దాన్ని తెరిచి అందులోని సుమారు రూ.1.50లక్షల విలువచేసే 5సవర్ల బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లాడు. ఉదయం నిద్ర లేచిన బాధితులు బీరువా లాకర్ తెరచి ఉండడం, బంగారు ఆభరణాలు కనిపించకపోవడం గమనించి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాములునాయక్, ఎస్సై సమన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీంతో వేలి ముద్రలు సేకరించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు. చోరీ జరిగిన తీరు ఆధారంగా తెలిసినవారే నిందితులని పోలీసులు భావిస్తున్నారు.

ప్రొబేషన్ డిక్లేర్ చేయాలి

నెల్లూరు (అర్బన్): సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్‌ను వెంటనే డిక్లేర్ చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బషీర్‌అహ్మద్ కోరారు. ఈ మేరకు డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డికి సచివాలయ ఉద్యోగులతో కలిసి మంగళవారం ఆయన వినతి పత్రం అందజేశారు. రెండో నోటిఫికేషన్‌లో ఉద్యోగాలు పొందిన వారు రెండేళ్ల ప్రొబేషన్ పీరియడ్‌ను పూర్తి చేసుకున్నారని, డిపార్ట్‌మెంట్ పరీక్షలు సైతం ఉత్తీర్ణులై నెలలు గడుస్తోందని తెలిపారు. అందువల్ల ఉద్యోగుల ప్రొబేషన్‌కు సంబంధించిన వివరాలను జిల్లాధికారులు త్వరగా ప్రభుత్వానికి పంపాలని కోరారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానాయుడు, అసోసియేట్ అధ్యక్షుడు బాబూరావు, ఉపాధ్యక్షుడు మనోజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి విజయ్ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్వామాలో సోషల్ ఆడిట్

నెల్లూరు(పొగతోట): ఉపాధి హామీ పనుల సోషల్ ఆడిట్‌ను మంగళవారం డ్వామా కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కొడవలూరు, విడవలూరు మండలాలకు సంబంధించిన సోషల్ ఆడిట్‌ను ఇక్కడ నిర్వహించినట్లు అధికారులు తెలిపారు.

దాడిపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన వారిపై సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు..కఠారిపాళేనికి చెందిన జీ కిషోర్ తన ఇంటివద్దే సైన్‌బోర్డు షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. గతేడాది ఆయన షాపులోని సెల్‌ఫోన్ అపహరణకు గురైంది. పక్కనే ఉన్న ఫర్నీచర్‌షాపులోని సీసీ కెమెరా ఆధారంగా స్థానిక యువకుడు దొంగలించాడని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిని మనస్సులో పెట్టుకున్న యువకుడి అమ్మ సుమ, బంధువులు మమత, బీనారి, పద్మ, అరుణ్ మరికొందరు ఈ నెల 9న రాత్రి కిషోర్‌పై దాడిచేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

18న కల్యాణ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



ఆహ్వానపత్రికలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నెల్లూరు(బృందావనం): శ్రీవారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని వికాస్ ప్రజాహిత సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆ సేవా సమితి అధ్యక్షుడు, 14వ డివిజన్ కార్పొరేటర్ కర్తం ప్రతాప్‌రెడ్డి తెలిపారు. బాలాజీ నగర్‌లోని వికాస్ ప్రజాహిత సేవా సమితి కార్యాలయంలో శ్రీవారి కల్యాణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మావతినగర్‌లోని సాయిదర్బార్‌అద్దాల మందిరం వద్ద సాయంత్రం 5.30 గంటల నుంచి కల్యాణ మహోత్సవం జరుగుతుందన్నారు. శ్రీవారి కల్యాణానికి హాజరయ్యే భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నగర ఎమ్మెల్యే పోలుబోయిన అనిల్ కుమార్‌యాదవ్, తదితరులు హాజరవుతారని వివరించారు. మూలస్థానేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎల్ వెంకటేశ్వరరెడ్డి, ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథస్వామి ఆలయ చైర్మన్ వై రమణ కుమార్, సేవా సమితి సభ్యులు, నిర్వాహకులు ప్రసాద్‌రెడ్డి, ఓబులరెడ్డి, రఘుపతినాయుడు, రామాంజనేయరెడ్డి, రేణుక శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ వెంకటసుబ్బయ్య ఆదేశాల మేరకు నెల్లూరుటౌన్-2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నగరంలోని 53, 54 డివిజన్లలో విద్యుత్ సిబ్బంది మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బిల్లులు చెల్లించని విద్యుత్ సర్వీసులను గుర్తించి సకాలంలో చెల్లించి అపరాధ రుసుం పడకుండా చూసుకోవాలని వినియోగదారులకు సూచించారు.అసిస్టెంట్ అకౌంట్స్‌ఆఫీసర్ నాగమణి, ఈస్ట్-1 విద్యుత్‌శాఖ ఏఈ మన్మథరావు, 20 మంది లైన్‌ఇన్‌స్పెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల క్షేమాభివృద్ధి కోసం ప్రార్థించాలి



నెల్లూరు(బృందావనం): ప్రజల క్షేమాభివృద్ధి కోసం పాస్టర్లు ప్రార్థించాలని విజయవాడ జియోన్ ఫెలోషిప్ సీనియర్ పాస్టర్ బీ జోసఫ్‌రెడ్డి అన్నారు. నెల్లూరు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ నెలవారి సమావేశాన్ని నీలగిరి సంఘంలోని హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీస్ చర్చిలో మంగళవారం నిర్వహించారు. పాస్టర్ బీ జోసఫ్‌రెడ్డి దైవ సందేశాన్ని అందించారు. అనంతరం జోసెఫ్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు పాస్టర్ లక్కు స్వరాజ్‌ను సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెవ. కే సాల్మన్, రెవ. కే డేవిడ్‌దయాసాగర్ పాస్టర్లు రెవ.భాస్కరయ్య, , రెవ.శరత్, రెవ. బెన్‌హర్‌బాబు, రెవ.రాజశేఖర్‌దాసరి, రెవ.కోటేశ్వరరావు, పాల్కొటి, తదితరులు పాల్గొన్నారు.

మధురం అమృతామురళి గానం



గాత్ర కచేరి చేస్తున్న అమృతామురళి

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలో 58వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. త్యాగరాజస్వామికి కళాకారులు వీనుల విందైన కీర్తనలు, హరికథలతో ప్రణమిల్లుతున్నారు. త్యాగరాజ స్మరణోత్సవాల్లో మూడోరోజైన మంగళవారం స్వామివారు యోగానరసింహస్వామి అలంకారంలో భక్తులను కటాక్షించారు. చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు అమృతామురళి తన మధురగానంతో శ్రీరఘువర అప్రమేయ(కాంభోజి రాగం ఆదితాళం), రామ నిన్నే నమ్మినాను (హుసేనీ రాగం ఆదితాళం), భజరే భజ మానసరామం(కానడ రాగం మిశ్రచాపు తాళం)తదితర కీర్తనలు ఆలపించి మైమరిపించారు. ఆర్కే శ్రీరామకుమార్(వయోలిన్), ఢిల్లీ సాయిరాం(మృదంగం), అనిరుధ్‌ఆత్రేయ (కంజీర) వాద్యసహకారం అందించారు

ఆకట్టుకున్న హరికథలు

స్మరణోత్సవాల్లో భాగంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు శ్రీవాణి భాగవతారిణిచే వ్యాసజననం హరికథ గానం, వేమూరి బాలకృష్ణమూర్తిచే పార్వతీకల్యాణం, వై శిఖామణి భాగవతారిణిచే భక్తప్రహ్లాద హరికథగానం చేశారు. సాయంత్రం 4నుంచి రాత్రి 7గంటల వరకు ఔత్సాహిక కళాకారులు తమ గాత్ర, వీణ, వయోలిన్‌తో త్యాగరాజ కీర్తనలను ఆలపించి సభికుల హర్షధ్వానాలందుకున్నారు. భిక్షాటనాపూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శులు శ్రీరామమూర్తి, ఎనమండ్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న యోగాసన పోటీలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఈ నెల 8 నుంచి 25వ తేదీ వరకు మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మంగళవారం యోగాసన పోటీలను నిర్వహించారు. 30 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొని ప్రాణాయమం, మత్స్యాసనం, శీర్షాసనం, ఉదరాసనం, సూర్యనమస్కారాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్ పోటీలను పర్యవేక్షించారు.

ఉపాధి లక్ష్యాలను సాధించాలి

నెల్లూరు(పొగతోట): ఉపాధి పనుల లక్ష్యాల సాధనకు మండలాధికారులు కృషిచేయాలని డ్వామా పీడీ వెంకటరావు అన్నారు. మంగళవారం ఆయన డ్వామా కార్యాలయం నుంచి క్లస్టర్ ఏపీడీలు, ఎంపీడీఓలు, ఏపీఓలు, ఈసీలు, టీఏలతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 1.15 కోట్ల పని దినాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఇప్పటి వరకు 1.02 లక్షల పనిదినాలు కల్పించడం జరిగిందన్నారు. నెలాఖరులోగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను 75 వేలకు తగ్గకుండా చూడాలని ఆదేశించారు. పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను అధికంగా చూపిస్తున్నారని, ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే సమయంలో మాత్రం కూలీల సంఖ్య తగ్గుతుందన్నారు. ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధాన ప్రక్రియను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు.

అమర్యాదకర సందేశాలపై కేసు నమోదు

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మహిళా కమిషన్ సభ్యురాలిని అవమానపరుస్తూ సోషల్ మీడియాలో అమర్యాదకర సందేశాలను పోస్టుచేసిన వ్యక్తితో పాటు మరో ఇద్దరిపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు..నగరానికి చెందిన గైనకాలజిస్టు రాధామాధవి, శ్రీనివాసులనాయుడు నడుమ వివాదాలు ఉన్నాయి. ఇటీవల శ్రీనివాసులనాయుడు ఓ న్యాయవాది సమక్షంలో ఆమెపై దౌర్జన్యం చేశారు. ఈ విషయమై బాధితురాలికి మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జల వెంకట లక్ష్మి నిలిచారు. దీనిని మనస్సులో పెట్టుకున్న న్యాయవాదుల అనుచరుడు బాబీభగత్ సోషల్ మీడియాలో లక్ష్మిని అవమానపరుస్తూ అమర్యాదకర సందేశాలను పోస్టు చేశారు. ఈ మేరకు బాధితురాలు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోస్టుచేసిన వ్యక్తితో పాటు మరో ముగ్గురిపై కేసు నమోదు చేశారు.